పంచాయతీ ఎన్నికలపై కదలిక!

- రేపు, ఎల్లుండి కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ
- వార్డుల మ్యాపింగ్.. ఓటర్ల జాబితా రూపకల్పన పై శిక్షణ
- 297 పంచాయతీల్లో రిజర్వేషన్ల ప్రక్రియపై భిన్న వాదనలు
- ఓఆర్ఆర్ లోపలి జీపీలు జీహెచ్ఎంసీలో విలీనంపై వాడీవేడి చర్చ



సాక్షి, సిటీబ్యూరో: పంచాయతీ ఎన్నికలపై ఆరు నెలల తర్వాత కదలిక వచ్చింది. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో అధికార యంత్రాంగం కార్యాచరణ ప్రారంభించింది. ఇందు కోసం వార్డుల మ్యాపింగ్, ఓటరు జాబితా తయారీపై కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులను ఆదేశించింది. దీంతో ప్రతి జిల్లా నుంచి ఐదారు గురు ఆపరేటర్ల వివరాలు పంపిస్తున్నారు. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని కంప్యూటర్ ఆపరేటర్లకు శుక్ర, శని వారాల్లో శిక్షణ కోసం ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు సంబంధిత ఎంపీఓలు, డీపీఓలకు ఆదేశాలు జారీ చేశారు. ఎట్టకేలకు పల్లె పోరుపై కసరత్తు ప్రారంభం కావడంతో పంచాయతీల్లోని రాజకీయ నాయకుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

అభివృద్ధిపై ప్రభావం...

పంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటితో ముగిసింది. అప్పటి నుంచి పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. ప్రత్యేక అధికారులు తమ మాతృశాఖ పనులకే పరిమితమవుతూ సభలు, సమావేశాలకు వచ్చి వెళ్తున్నారనే తప్ప సమస్యలను పరిష్కరించడం లేదనే ఆరోపణలున్నాయి. అలాగే ఇటీవల కొందరు అధికారులు కూడా సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాల నుంచి బదిలీ అయ్యారు. ఫలితంగా గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయి. ఏ చిన్న సమస్య వచ్చినా వార్డు సభ్యులు, సర్పంచులను ఆశ్రయించే ప్రజలు ప్రత్యేకాధికారులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. నిర్ణీత వ్యవధిలో ఎన్నికలు జరగకపోవడంతో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోగా పల్లె అభివృద్ధిపై ప్రభావం పడుతోంది.

పంచాయతీ ఎన్నికలపై చర్చ..

నగర శివారుల్లో 279 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇందులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 61, రంగారెడ్డి జిల్లాలో 218 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించాల్సిన ఉన్నప్పటికి ఇందులో 34 జీపీలు పురపాలికల్లో కలుపుతారన్న చర్చ సాగుతోంది. ఈ జీపీల్లో 23 మేడ్చల్ జిల్లాల్లో ఉండగా 11 రంగారెడ్డి జిలాల్లో ఉన్నాయి. మేడ్చల్ జిల్లాలో మిగిలిపోయిన 38జీపీలకు కూడా ఎన్నికలు నిర్వహిస్తారా లేక వాటిని కూడా మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తారా అనే అభిప్రాయలు రాజకీయవర్గాలో జోరందుకున్నాయి. ఆగస్టు మొదటి వారంలోపు ఓటరు జాబితా సిద్ధం చేయాలనే సీఎం ప్రకటించిన నేపథ్యంలో పల్లెల్లో ఎన్నికల చర్చ జోరుగా సాగుతోంది. ఆశావహులు రిజర్వేషన్ల ఖరారుపై తమ అనుచరగణాలతో చర్చిస్తున్నారు. ప్రతి జిల్లా నుంచి ఐదారుగురు ఆపరేటర్లు శిక్షణలో పాల్గొనున్నారు. వార్డుల మ్యాపింగ్, వార్డుల వారీగా ఓటరు జాబితా రూపొందించే ప్రక్రియపై వారికి శిక్షణ ఇవ్వనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఓటరు జాబితా అందింది. దాని ఆధారంగా పంచాయతీ అధికారులు తుది జాబితా సిద్ధం చేస్తారు. ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీలకు జనాభా, బీసీలకు ఓటర్ల ప్రకారం రిజర్వేషన్లు కేటాయిస్తారు. గత ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్లను ఆయిదేళ్ల నుంచి పదేళ్లకు పెంచుతూ చట్టం తీసుకొచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం ఆ మేరకే నిర్వహిస్తుందా.. రిజర్వేషన్లు మారుస్తుందానన్న విషయంపై సందిగ్ధత నెలకొంది.

ఓఆర్ఆర్ లోపలి జీపీల విలీనంపై ...

నగర శివారుల్లోని ఓఆర్ఆర్ లోపలి గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాలను జీహెచ్ఎంసీ పరిధిలోకి ప్రభుత్వం విలీనం చేయగలదన్న ప్రచారం నేపథ్యంలో ఓఆర్ఆర్ లోపలి గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తారా.. లేదానన్న చర్చ కూడా రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. శివారు పురపాలక సంఘాలు ,గ్రామ పంచాయతీల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఏ నలుగురు నాయకులు, కార్యకర్తలు గూమిగూడిన అదే విధమైన చర్చసాగుతోంది. ఓఆర్ఆర్ లోపలి జీపీలు, పురపాలక సంఘాల విలీనం అంశంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, దీనికి అనుగుణంగానే సంబంధిత అధికార యంత్రాంగం ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు ప్రచారం జోరుగా సాగినా సంబంధిత జిల్లా అధికారులు మాత్రం అధికారికంగా ధృవీకరించటం లేదు.

బోనాల పండగకు భారీ ఏర్పాట్లు


సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఈ నెల 4న జరిగే బోనాల ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు బుధవారం వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ విభాగాల అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని ఆలయాల వద్ద వీధి లైట్లు, విద్యుత్ దీపాలు, రోడ్లకు మరమ్మతులు, బ్లీచింగ్ తదితర కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, జలమండిలి డిజిఎం రజనీకాంత్ రెడ్డి, ఏఈలు రాజ్‌కుమార్, రవిందర్ రెడ్డి, సానిటరీ సూపరివైజర్ రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చాలి


డ్రైవర్లను సత్కరిస్తున్న రవికుమార్

బోడుప్పల్: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ల పాత్ర కీలకమని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ అన్నారు. బుధవారం చెంగిచర్ల ఆర్టీసీ డిపోలో ప్రమాదరహిత వారోత్సవాల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎలాంటి ప్రమాదాలు చేయకుండా సురక్షితంగా బస్సు నడిపిన సీనియర్ డ్రైవర్లు యాదయ్య, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లును సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. 30 ఏళ్లుగా ప్రమాదం జరగకుండా చూడడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కవిత, అసిస్టెంట్ మేనేజర్లు ఆనందరావు, సాయి సుబ్రమణ్యం, డిప్యూటీ సూపరిండెంట్ సత్యన్ పాల్గొన్నారు.

కాలనీ సమస్యలను పరిష్కరిస్తా

అల్వాల్: అల్వాల్ డివిజన్ పరిధిలోని రాజీవ్ వీకర్ సెక్షన్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు బుధవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో పెరిగిన చెట్లు, ముళ్ల పొదల కారణంగా పాములు, విష పురుగుల వస్తున్నాయన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నందికంటి శ్రీధర్, రహమత్ ఖాన్, గౌస్‌ఖాన్, సయ్యద్ ఆరిఫ్ తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసిన రాజీవ్ వీకర్ సెక్షన్ కాలనీ వాసులు

సమస్యలను పరిష్కరించండి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

బోడుప్పల్: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను బుధవారం బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్ కలిసి స్థానిక సమస్యలపై చర్చించారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో నెలకొన్న ప్రధాన సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కలెక్టర్‌ను కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చీరాల నర్సింహ్మా, సింగిరెడ్డి పద్మారెడ్డి, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోవాలి


శానిటేషన్ విభాగం అధికారులతో సమావేశమైన కార్పొరేటర్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ పరిధిలో శానిటేషన్ సిబ్బంది పనితీరులో మార్పు రావాలని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో శానిటేషన్ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గతంలో యూజీడీ జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నప్పుడు బాగుండేదని జలమండలి పరిధిలోకి వెళ్లిన తర్వాత అధ్వానంగా మారిందన్నారు. సకాలంలో సిల్ట్ తీయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాంకీ పనితీరు కూడా అధ్వానంగా ఉందని, సొంతంగా బాబ్‌కాట్, జేసీబీలను ఏర్పాటు చేసుకుంటేనే శానిటేషన్ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. తగినంత సిబ్బంది లేరని, మృతి చెందిన వారి స్థానంలో వారి కుటుంబసభ్యులకైనా ఉద్యోగం కల్పించాలన్నారు. సమావేశం అనంతరం జోనల్ కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యలను వివరించారు. సమావేశంలో సానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, నాగరాజు, సిబ్బంది శ్రీనివాసరెడ్డి,గిరి, ఎల్లయ్య పాల్గొన్నారు.

దర్బార్ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు


తనిఖీలు చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు


నిల్వ ఉంచిన కుళ్లిన మాంసం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దర్బార్ బార్ అండ్ రెస్టారెంట్‌లో జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారి దేవేందర్ నేతృత్వంలో బుధవారం తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రిజ్‌లో నిలువ ఉన్న మాంసం, కిచెన్‌లో కుళ్లిన చికెన్, చేపలు పాచిపోయిన ఇతర పదార్థాలను గుర్తించారు. రిఫ్రిజ్ రేటర్లలో రోజుల తరబడి నిలువ ఉంచిన మాంసాహారాన్ని మళ్లీ కోటింగ్ వేసి వేడి చేసి కస్టమర్లకు అందిస్తున్నట్లు వెల్లడైంది. శాంపిల్స్ సేకరించిన అధికారులు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రమాణాలను పాటించకుండా కస్టమర్లకు కలుషిత పదార్థాలను విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అంధ విద్యార్థులకు లయన్స్ క్లబ్ చేయూత

గౌతంనగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్-మల్కాజిగిరి ఒలింపిక్స్ సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వి. కృష్ణప్రసాద్ అన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం గౌతంనగర్ డివిజన్, జ్యోతినగర్‌లోని 42 మంది అంధ విద్యార్థులు, విద్యార్థినులకు లయన్స్ క్లబ్ తరుపున బెడ్‌షీట్‌లు, నిత్యావసర సరుకులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కల్లెం కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, కొడిమెల హన్మంతరావు, లక్ష్మీమూర్తి, టి. సుజాత, కె. సుధ, భారతి, కృష్ణ, కె. రవి, శ్రీహరి పాల్గొన్నారు.


నిత్యావసరాలను అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

అల్వాల్: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అంబిక కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా దొమ్మట గ్రామానికి చెందిన కనుగుల స్వామి అలియాస్ మహేష్ (30) బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చి ఓల్డ్ అల్వాల్‌లోని అంజనపురి కాలనీలో ఉంటూ డ్రైవర్‌గా పని చేసేవాడు. పలువురి వద్ద అప్పు చేసిన అతను వాటిని తీర్చేదారిలేక బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సన్మానం


పతకాలు సాధించిన విజేతలు

గౌతంనగర్: కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపిన్‌షిప్ పోటీల్లో చిదాంబ్ తైక్వాండో అకాడమీ సభ్యులు 7 పతకాలు సాదించారు. టి. సుందర్ కిషోర్ మాస్టర్ ఆధ్వర్యంలో కోచ్ బి. శివ శంకర్ మాస్టర్ మల్కాజిగిరి బ్రాంచ్ గౌతంనగర్ విద్యార్థులు సిద్దార్థ్ శంకర్ నాయర్ బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. నిశాంత్, రవీకాంత్‌లు కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. విజేతలను బుధవారం గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌతంనగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.బి. పట్నాయక్, కందిబండ నరసింహారావులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం


రాఘవరెడ్డి (ఫైల్)

మల్లాపూర్: ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్లాపూర్ ఎన్ఎఫ్‌సీ కాలనీకి చెందిన బొల్లంపల్లి రాఘవరెడ్డి(92) జూలై 27న తెల్లవారుజామున ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. అతను తిరిగి రాకపోవడంతో కుమారుడు బొల్లంపల్లి ప్రవీణ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు నాచారం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేషన్ అభివృద్ధికి కృషి


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ అజయ్ యాదవ్

బోడుప్పల్: బోడుప్పల్ నగర కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆయన 24వ డివిజన్, జ్యోతినగర్ నుంచి చిలుకానగర్ మార్గంలో రూ.40లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దశల వారీగా రోడ్లు, తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అందుకు అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి గౌడ్, 24వ డివిజన్ కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేశ్‌యాదవ్, డిఈ చిరంజీవి కాలనీవాసులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలను ఉపేక్షించేది లేదు


అధికారులతో వాగ్వాదం చేస్తున్న వ్యాపారులు



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం..

కుషాయిగూడ: ఫుట్‌పాత్ ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కాప్రా టౌన్‌ప్లానింగ్ ఏసీపీ గిరిరాజ్ అన్నారు. బుధవారం కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కుషాయిగూడ పోచమ్మ ఆలయం నుంచి డీమార్ట్ వెళ్లే మార్గంలో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. ఎండ, వానల నుంచి రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న వాటిని తొలగించడాన్ని తప్పుపడుతూ వ్యాపారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ప్రధానమార్గాలు, రద్దీ రోడ్ల వెంట ఫుట్‌పాత్‌ల ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు.

నిర్దేశిత లక్ష్యాలకు తగ్గట్టుగా రుణాలు అందించాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి,సిటీబ్యూరో: నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందించాలని, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి బ్యాంకర్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో ఆయన డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశాన్ని నిర్వహించారు. చేతివృత్తుల వారికీ పీఎం విశ్వకర్మ స్కీం ద్వారా ఆర్థిక సహాయం అందించి, అంతరించిపోతున్న హస్త కళలకు జీవం పోయాలన్నారు. ఈ స్కీంలో దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు ఆధార్, రేషన్ కార్డులు జత చేసి గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిని జిల్లా స్థాయిలో దరఖాస్తులను పరిశీలించి అర్హులైనవారికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు కార్డు అందజేయడం జరుగుతుందన్నారు. గుర్తింపు కార్డు పొందిన వారికీ అవసరమైన ఉపకరణాలు పీఎం విశ్వకర్మ స్కీం ద్వారా మొదటి విడతగా రూ.50 వేలు , రెండు, మూడు విడతలలో రూ.లక్ష నుంచి రెండు లక్షలు వరకు అందజేస్తారన్నారు. పట్టణ ప్రాంతమైన మేడ్చల్ జిల్లాలోని యువతకు ఉన్నత విద్యకు ఎక్కువశాతం రుణాలు అందించడం ద్వారా ఉన్నత విద్యా ప్రమాణాలను పొంది వారి బంగారు భవిష్యత్తుకు బాట వేసుకునే అవకాశముంటుందన్నారు.

పంట రుణాలు ఇవ్వాలి

రైతులకు పంట రుణాలు, టర్మ్ రుణాలు, వ్యవసాయ అనుబంధ రుణాలు విరివిగా అందించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పరిశ్రమలు, డీఆర్‌డీఓ తదితర శాఖల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్య, గృహ నిర్మాణం, ఇతర ప్రాధాన్యత రంగాలకు అర్హులైన పేద లబ్ధిదారులకు మంజూరు చేయాలని కోరారు. చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి అవగాహన కలిగిస్తూ విరివిగా రుణాలు అందించాలని కోరారు. ప్రభుత్వ శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు నిర్ణీత గడువులోగా రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకులో దరఖాస్తులు పెండింగులో లేకుండా చూసుకోవాలని, తిరస్కరణకు గురైన వాటిని పరిశీలించి తగిన రీతిలో బ్యాంకులు పంపాలని అధికారులకు సూచించారు.

మహిళా గ్రూపులకు..

స్వయం సహాయక సంఘాల రుణాలను సకాలంలో తిరిగి చెల్లించే విధంగా బ్యాంకర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత డిజిటల్ లావాదేవీలపై అవగాహనా కలిగించాలని బ్యాంకర్లకు సూచించారు. రెండో దశ రైతు రుణ మాఫీ పూర్తయినందున బ్యాంకర్లు పంట రుణాల పునరుద్ధరణ వేగవంతం చేయాలన్నారు. అదనపు కలెక్టరు వివిధ ప్రభుత్వ ప్రాయోజిత పథకాల పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ ఎజీఎం శ్రీలక్ష్మి శ్రావ్య, కెనరా బ్యాంకు డిజిఎం, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివప్రసాద్, ఆర్‌బీఐ అధికారి పల్లవి , నాబార్డ్ డిడిఎం పి.అఖిల్, కృష్ణకాంత్ రాయ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి బాబు మోజెస్, జిల్లా వ్యవసాయాధికారి మేరీ రేఖ, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి, ఆయా బ్యాంకుల మేనేజర్లు, ఆర్బీఐ, నాబార్డుతో పాటు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎర్ర పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్, రాజీవ్‌నగర్‌లో బుధవారం ఎర్ర పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమర్షియల్ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

కాప్రా: గాంధీనగర్‌లో ఇళ్ల మధ్య చేపట్టిన వ్యాపార సముదాయాలపై చర్యలు తీసుకోవాలని ఆది జాంబవ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం కాప్రా సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ముకుంద్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గాంధీనగర్‌లో రెండు ఇళ్ల మధ్య వ్యాపార సముదాయం కోసం నిర్మాణాలు చేపట్టారని, వీటి మూలంగా భవిష్యత్‌లో తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. నివాస ప్రాంతాల మధ్య ఇలాంటి నిర్మాణాలతో అవరోధాలు ఏర్పడతాయన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆది జాంబవ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వరంగల్ జాతీయ రహదారికి మరమ్మతులు చేపట్టండి


మంత్రి కోమటి రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ నుంచి నారాపల్లి వరకు కొనసాగుతున్న ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో భాగంగా రోడ్లు శిథిలమై ప్రజలు అవస్థలు పడుతున్నారని వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతూ ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్లుగా సాగుతున్న రోడ్డు పనుల వల్ల వాహనదారులు అవస్థలు పడుతున్నారన్నారు. వర్షకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందన్నారు. దీనిపై స్పందించిన మంత్రి త్వరలో ఉప్పల్ రోడ్డును స్వయంగా వచ్చి పరిశీస్తానని రూ. 30 కోట్లతో రోడ్డు అభివృద్ధి చేయనున్నట్లు హామీ ఇచ్చినట్లు పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలి


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రామంతాపూర్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని భరత్‌నగర్‌లోని సెయింట్ జాన్స్ హైస్కూల్ స్కూల్ చైర్మన్ సూరం రామ్‌రెడ్డి ప్రిన్సిపాల్ మమతా రామ్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రేటర్ హైదరాబాద్ వైఎంసీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలికల విభాగం కబడ్డీ పోటీల్లో స్కూల్ జట్టు గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా వారు కబడ్డీ శిక్షణ ఇచ్చి విజయం సాధించేందుకు కృషి చేసిన పీఈటీలు చుక్కయ్య సాగర్ ప్రశాంత్ ధనలక్ష్మీలను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

కార్పొరేటర్ శ్రీవాణి హౌస్ అరెస్టు



రామంతాపూర్ : రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలకు నిరసనగా రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా బుధవారం అసెంబ్లీని ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా చర్యగా రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావును పోలీసులు ఇందిరానగర్‌లోని ఆమె స్వగృహంలో హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను నిరసిస్తూ త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామన్నారు.

'కాగ్నిజెంట్' పరీక్షలో విద్యార్థిని అక్షయ ప్రతిభ


ల్యాప్‌టాప్‌ను గెలుచుకున్న అక్షయ..

సనత్‌నగర్: కాగ్నిజెంట్ సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వహించిన పోటీ పరీక్షలో అశోక్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాల (సనత్‌నగర్ ఓల్డ్)కు చెందిన 8వ తరగతి విద్యార్థిని అక్షయ మోదటి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఆమె చూపిన ప్రతిభకు గాను సంస్థ నిర్వాహకులు రూ.80 వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌ను అందజేశారు. రెండో బహుమతిగా లక్ష్మీకళ రూ.20 వేల విలువ చేసే ట్యాబ్‌ను సాధించింది. సుమారు 30 పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు ఈ పోటీ పరీక్షకు హాజరుకాగా అక్షయ మొదటి బహుమతి గెలుచుకోవడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్తాతో పాటు ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు ఆమెను అభినందించారు.